ఇదేనా చెత్త శుద్ధి?

- రహదారులపై పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- దుర్గంధంగా పరిసరాలు
- తరలించాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు, సిబ్బంది



కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

చంపాపేట: నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదని స్పష్టంగా కనిపిస్తోంది. చెత్త తరలింపు పేరుతో తూతూ మంత్రంగా పనులు చేపట్టి నిధులు దండుకోవటం పరిపాటిగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడికక్కడే చెత్త కుప్పలు పేరుకుపోవడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడేస్తున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంపాపేట, ఐఎస్‌సదన్ డివిజన్ సరిహద్దులోని చంపాపేట భారత్ గార్డెన్ రహదారిపై, అదే విధంగా మీర్‌పేట మున్సిపాలిటీ, చంపాపేట డివిజన్ సరిహద్దులోని గాయత్రీ నగర్ చౌరస్తా నుంచి కర్మన్‌ఘాట్‌కు వెళ్లే ప్రధాన రహదారికి అడ్డంగా పేరుకుపోతున్న చెత్తను రోజుల తరబడి తరలించకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తోందని అటుగా రాకపోకలు సాగించేవారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది నిర్లక్ష్యమే..

డివిజన్ పరిధిలోని మానసా గార్డెన్ వెనుక భాగంలో మైనారిటీ గురుకుల పాఠశాల ప్రధాన గేటుకు ఎదురుగా, చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో, ఎస్‌జీఆర్ కాలనీ పెట్రోల్ బంక్ వెనుక భాగంతో పాటు పలు జనవాసాల మధ్యనే రహదారిపై చెత్త డంపింగ్ చేస్తున్నా సిబ్బంది నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. చెత్త తరలింపు విషయంలో మా పరిధిలోకి వచ్చినా మాకు ఇష్టం వచ్చినప్పుడు తరలిస్తామని మీర్‌పేట మున్సిపల్, ఐఎస్‌సదన్ డివిజన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ముక్కుపుటలు అదిరే దుర్గంధంతో సహజీవనం చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని చంపాపేట, కర్మన్‌ఘాట్ వాసుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవగాహన కల్పనలో విఫలం..

డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులపై శానిటేషన్ సిబ్బందికి ఉన్న చెత్త శుద్ధి కాలనీ అంతర్గత రహదాలపై లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. తడి పొడి చెత్తను తప్పని సరిగా వేరుచేసి చెత్త తరలింపు వాహన సిబ్బందికి అందజేయాలని ప్రచార ఆర్భాటాలు చేస్తున్న సర్కిల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో కాలనీ వాసులకు అవగాహన కల్పించటంలో విఫలం అయ్యారని స్థానిక కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే రహదారులు చెత్త డంపింగ్ కేంద్రాలుగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కిల్ సిబ్బంది చెత్త తరలింపు విషయంలో కాలనీ వాసులకు అవగాహన కల్పించటం, రహదాలపై చెత్తను వేసేవారిపై నిఘా పెట్టి జరిమానాలు వేయటంతో పాటు మీర్‌పేట మున్సిపల్, ఐఎస్‌సదన్ , చంపాపేట డివిజన్ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఎప్పటికప్పుడు తరలించాలి..



గాయత్రినగర్ చౌరస్తా నుంచి కర్మన్‌ఘాట్ లోకి వెళ్లాలంటే నరకాన్ని తలపిస్తుంది. ముక్కుపుటలదిరే దుర్గంధం నడుమ చెత్త కుప్పలు దాటుకుంటూ.. దుంకుతూ వెళ్లాల్సిందే. ఆదమరిస్తే ఇక అంతే. రహదారిపై పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎప్పటికప్పుడు తరలించాలి. శానిటేషన్ సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి. చెత్తరహిత కాలనీలుగా తీర్చిదిద్దాలి.

– కొండ యాదగిరి, దుర్గానగర్

ఫిర్యాదు చేసినా లాభం లేదు..



జీహెచ్‌ఎంసీకి అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లిస్తున్నాం. భారత్ గార్డెన్ ముందు రహదారిపై చెత్త డంపింగ్ కేంద్రాని తలపిస్తుంది. ఆధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా మా పరిధిలోకి రాదంటూ దాట వేస్తున్నారు. సరిహద్దు లొల్లిలో మాకేందుకు ఈ బాధ. కనీసం ఆ ప్రాంతంలో డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలి. చెత్తను డంపింగ్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి జరిమానా విధించాలి.

భానుగ రమేష్, చంపాపేట

మహ్మద్ ప్రవక్త జీవితం ఆదర్శనీయం

ఎమ్మెల్యే అహ్మద్ బలాల



సైదాబాద్: మహ్మద్ ప్రవక్త జీవితం సర్వ మానవాళికి ఆదర్శనీయమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల అన్నారు. 'మిలాద్ ఉన్ నబీ'ని పురస్కరించుకొని జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రవక్త జీవిత పరిచయ పక్షోత్సవాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మలక్‌పేట శాఖ అధ్వర్యంలో ఆదివారం సైదాబాద్ మహారాజా ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన సీరత్ ఎక్స్‌పోను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రవక్త చేసిన బోధనలు, ఆయన జీవితంలోని చారిత్రక ఘట్టాలతో కూడిన వివిధ అంశాలను ఎక్స్‌పోలో ప్రదర్శించారు. మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై 33 పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 6 వేలకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రవక్త మహ్మద్ ప్రతిపాదించిన దేవుని ఏకత్వ భావన, మానవులంతా ఒక్కటే అన్న బోధనలు మానవుల మధ్య ఐక్యతను పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ తెలంగాణ ఉపాధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ ముబష్షిర్, మలక్‌పేట శాఖ అధ్యక్షుడు ముజీబుల్ ఆలా, జిలాని, సంస్థ మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతలో క్రీడా స్ఫూర్తిని నింపాలి

మలక్‌పేట: యువతలో క్రీడా స్ఫూర్తిని నింపాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన 'వీ8 ఎట్‌దిరేట్ బాక్స్ క్రికెట్' పేరుతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు ఆసక్తి, ప్రతిభ ఉన్న రంగాలలో ప్రోత్సహించాలన్నారు. క్రీడల ప్రాముఖ్యతపై పిల్లలకు అవగాహన కల్పించి శిక్షణ ఇప్పిస్తే మరింతా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, నాయకులు అజీత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సహదేవ్‌యాదవ్, రవీందర్ రెడ్డి, సంఘిరెడ్డి, రఘునందన్‌రెడ్డి, విజయ్‌కాంత్, నిర్వాహకులు నరేందర్, శ్యాంసుందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, వై. రవీందర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సైదాబాద్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న సైదాబాద్‌లో నివసించే డాక్టర్ వేముల నారాయణ, డాక్టర్ ఎస్.విజయభాస్కర్‌ను కలాం విజన్ సంస్థ ప్రతినిధులు సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఇరువురికి ఆచార్య దేవోభవ-2024 అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము స్థాపించిన చంద్రికా గ్రంథ మండలి సంస్థ ఆధ్వర్యంలో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్నామన్నారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రచయితల పుస్తకాలను తాము ప్రచురించి సాహిత్య లోకానికి పరిచయం చేస్తున్నామన్నారు.

హిందూ ధర్మ రక్షణే ఎజెండాగా ముందుకు సాగాలి

చంచల్‌గూడ: ఆంక్షల పేరుతో హిందువుల పండుగలను అడ్డుకోవడం గత, ప్రస్తుత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, శ్రద్ధాబాద్ ప్రాంత గణేష్ ఉత్సవ సమితి నాయకుడు సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం కుర్మగూడలో జరిగిన గణేష్ మండప నిర్వాహకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హైందవ ధర్మ రక్షణకు శ్రద్ధాబాద్ ప్రాంతం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినా రాష్ట్రంలో హిందూ పండుగలు, ఉత్సవాల పట్ల అనచివేత ధోరణి కొనసాగుతుందన్నారు. పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు హిందూ ధర్మ రక్షణే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగాలన్నారు. నిమజ్జన ఉత్సవానికి అవసరమయ్యే వాహనాలను ఉత్సవ సమితి సమకూరుస్తుందని భారీ వాహనాల కోసం నిర్వాహకులు హైవేల వెంటపడి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ఊరేగింపులను సకాలంలో ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, భాగ్యనగర్, శ్రద్ధాబాద్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు జగన్నాథం, రాచూరి మల్లేషం, బర్ల శ్రవణ్ కుమార్, నిరంజన్‌యాదవ్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలి

నాగోలు: ఈ నెల 23, 24 తేదీల్లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో జరిగే ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు బాతరాజు నరసింహా, ఏఐటీయూసీ సరూర్‌నగర్ మండల అధ్యక్షులు బోయపల్లి రాములు గౌడ్ ప్రధాన కార్యదర్శి మద్దిలేటి పిలుపునిచ్చారు. ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా కార్మిక చట్టాలను మారుస్తూ 64 చట్టాలు తెచ్చి కార్మికుల పొట్టకొట్టేలా చేస్తున్నారని అన్నారు. కొత్త జీవోలను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. కార్మికులు, కర్షకులను నిలువు దోపిడీ చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మధు, కృష్ణమూర్తి, నాగరాజు, రాజు, నరసింహ, నవీన్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వనస్థలిపురం: గణపతి నవరాత్రుల సందర్భంగా హయత్‌నగర్ డివిజన్ శారదానగర్ కాలనీలోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొప్పోలు జగన్నాథరావుచే భక్త రామదాసు ఏక పాత్రాభినయం, శ్రీకృష్ణ రాయభారం పౌరాణిక పద్య నాటకం ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, కళా భారతి సంస్థ కన్వీనర్ కొప్పోలు జగన్నాథరావు, కార్యదర్శి అరుణ్‌కుమార్, యాదగిరిరావు, యజ్ఞ భగవాన్, సుబ్బారావు, ప్రసన్నాంజనేయులు, నరసింహారావు, డా.అప్పారావు, హనుమంతరావు, విష్ణుమూర్తి, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోర్టు వివాదాలు పరిష్కరించాలి

చాదర్‌ఘాట్: మంఖాల్-2 డబుల్ బెడ్రూమ్ సముదాయంలో తమకు ఇళ్లు కేటాయించాలని, కోర్టులో వివాదం త్వరగా పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని మంఖాల్-2 డిగ్నిటీ హౌస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు ఖాజా అన్నారు. ఆదివారం నిర్వహించిన మంఖాల్-2 డిగ్నిటీ హౌస్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యుల సమావేశంలో ఖాజా మాట్లాడుతూ.. కోర్టు వివాదాన్ని త్వరగా పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. కోర్టులో వివాదం కారణంగా ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు కేసును పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం లేదని, దీంతో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. హైకోర్టులో సింగిల్ బెంచ్ పై ఉన్న కేసును డబుల్ బెంచ్‌పై తీసుకెళ్లేందుకు లబ్ధిదారులు అందరూ ఏకమై న్యాయవాదిని సంప్రదించాలని పిలుపునిచ్చారు.

సోషల్ ఇంపాక్ట్ అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న రాము, యశస్వీని జొన్నలగడ్డ

మన్సూరాబాద్: కొవిడ్ సమయంలో ఎన్నో కుటుంబాలకు స్వయం ఉపాధి కల్పించిన జేసీఐ ఇండియా సంస్థ రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము, ప్రాజెక్టు ద్రిషా నిర్వాహకురాలు యశస్వినీ జొన్నలగడ్డకు సోషల్ ఇంపాక్ట్ అవార్డు ప్రకటించారు. ఆదివారం నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద సంస్థ ప్రతినిధులు సుమతి చందా, అరవింద్ అవార్డును అందజేశారు.

నిబద్ధతతో చేసే సేవలతోనే గుర్తింపు

చంపాపేట: నిబద్ధత, నిస్వార్థంతో చేసే సేవలతోనే ఉద్యోగికి సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక చైర్మన్ కాచం సత్యనారాయణగుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ వేడుకలకు ఆయన హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలి



మలక్‌పేట: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి పట్టుదలతో కృషి చేయాలని ప్రగతి కాలేజీ చైర్మన్ ఆర్. రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రగతి డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజురెడ్డి, డైరెక్టర్ చిన్నారెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

నాగోలు: సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం అన్నారు. ఇటీవల నిర్వహించిన అసిస్టెంట్ ఎగిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) గెజిటెడ్ పరీక్షలలో చైతన్యపురి రూప ఐఏఎస్ అకాడమీకి చెందిన 613 విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆదివారం కొత్తపేటలో రూప ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో అత్యధిక ఇంజినీర్లు ఉన్న దేశాల్లో భారత్ ముందు వరసలో ఉందన్నారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ..ఉద్యోగాలు సాధించిన వారు తమ వృత్తిలో రాణించాలని, పట్టుదలతో ముందుకు సాగి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలోఅకాడమి డైరెక్టర్, స్వరూపరాణి, ఫ్యాకల్టీ వీరబాబు, ఎగిక్యూటివ్ ఇంజినీర్ జగతి కాసీం, ఓయు అసిస్టెంట్ ప్రొఫెసర్ గజ్జ శ్రీరామ్ పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం

విద్యుత్ సరఫరాలో లోపాలు లేవు

మాధవరెడ్డి, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

చంపాపేట: చంపాపేట డివిజన్ చిలుకబస్తీ, సుల్తానా అల్వా కాలనీలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి హెచ్చుతగ్గులు, లో ఓల్టేజీ సమస్యలు లేవని సరూర్‌నగర్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ మాధవరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం కొన్ని మీడియాలో ప్రచురించిన కథనాలకు స్పందించిన రాష్ట్ర సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ సీఎండీ ఆదేశాలతో ఆయన ఆధ్వర్యంలో కాలనీలోని 78 ఇళ్లలో విద్యుత్ ఓల్టేజీ, సరఫరాలో హెచ్చుతగ్గులను ప్రత్యేక పరికరాల ద్వార పరీక్షించారు. విద్యుత్ సరఫరా లోపాలతో గృహోపకరణాలు కాలిపోయాయని కొన్ని మీడియాలో ప్రచురించిన కథనాలలో ఎలాంటి వాస్తవం లేదన్నారు.విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందంచేందుకు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. చంపాపేట ట్రాన్స్‌కో డీఈ సురేష్, ఏడీఈ రాజేందర్, ఏఈ విజయకుమార్, సిబ్బంది రవీందర్ ఆయా కాలనీల్లో పర్యటించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మన్సూరాబాద్: విశ్వకర్మ స్వర్ణకార సంఘం, హయత్‌నగర్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ వినాయకనగర్‌కాలనీలోని కమ్యూనిటీహాల్‌లో ఈ నెల 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా విశ్వకర్మ యజ్ఞమహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు రాగఫణి సతీష్ చారి, ముఖ్య సలహాదారుడు పెరికేటి నాగరాజుచారి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం వినాయకనగర్‌కాలనీలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధిలోని విశ్వకర్మ, స్వర్ణకార కుటుంబ సభ్యులు హాజరై యజ్ఞ మహోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌చారి, కోశాధికారి కేశవచారి, యజ్ఞమహోత్సవ కమిటీ అధ్యక్షుడు యాదగిరిచారి, ప్రవీణ్‌చారి పాల్గొన్నారు.



బీ-బ్లాక్‌లోని మండపాన్ని సందర్శించిన ఎంపీ రఘునందన్



వాసవి కాలనీలో గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా



సైదాబాద్‌లో పూజల్లో పాల్గొన్న లింగాల హరిగౌడ్, లక్ష్మణ్ ఠాకూర్



భాగ్యలత కాలనీ అరుణోదయ నగర్ రోడ్ నం-3లోని గణేష్ ఉత్సవ్ కమిటీ



పూజల్లో పాల్గొన్న ముద్రబోయిన శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్



బీఎన్‌రెడ్డినగర్‌లో వినాయక పూజలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



సహారాస్టేట్స్‌కాలనీలో పూజలు నిర్వహించిన కొప్పుల విఠల్‌రెడ్డి



గణనాథుడి పూజల్లో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

గణపయ్యా.. దీవించయ్యా

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆయా మండపాల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలు ప్రాంతాల్లో అన్నదాన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మండపాలను సందర్శించి వినాయకుడిని దర్శించుకుంటున్నారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



భరత్‌నగర్ కాలనీలో గణేష్ పూజలో పాల్గొన్న కార్పొరేటర్ పవన్‌కుమార్



బండ్లగూడ శ్రీనివాస్ కాలనీలో పూజలో పాల్గొన్న సురేందర్ యాదవ్



ధనుంజయ అపార్టుమెంట్‌లోని గణపతి పూజలో పాల్గొన్న భక్తులు



హస్తినపురంలోని తుల్జాభవాని కాలనీ విజ్ఞాన్ పాఠశాలలో..

లడ్డూ వేలం..భక్తుల సొంతం



చంద్రపురికాలనీ సంక్షేమ సంఘం వినాయక లడ్డూను రూ.2,60,116లకు దక్కించుకున్న మందటి సంజీవరెడ్డి



రూ.2.66 లక్షలకు లడ్డూ దక్కించుకున్న రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



కొత్తపేట స్నేహపురి కాలనీ లడ్డూను రూ.1.51 లక్షలకు దక్కించుకున్న యాదగిరి